క్లుప్తంగా

విద్యార్థులకు ప్రత్యేక శిక్షణా తరగతులు

కాకినాడ సిటీ : భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ), ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) ఆధ్వర్యంలో మే 2వ తేదీ నుంచి పదో తరగతిలో ప్రవేశించిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు యూటీఎఫ్, ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ వరహాలుబాబు, బి.రవిశ్రీనివాస్, ఎ.సంజయ్, ఎ.వాసుదేవ్‌లు ఆదివారం తెలిపారు. ఈ శిక్షణ తరగతులు ఉదయం 8 గంటల నుంచి 10.30 గంటల వరకు ఉంటున్నాయని, 31వ తేదీ వరకు జరుగుతాయన్నారు. పదో తరగతి సబ్జెక్టులపై నిపుణులైన ఉపాధ్యాయుల సహకారంతో ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 30వ తేదీ లోపు ఫోన్ ద్వారా తమ వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు. పేర్లు నమోదుకు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు 9441710273, 9441251462, 9346264224, 78932118969 నంబర్లలో సంప్రదించవచ్చని కోరారు.

పాడితో అదనపు ఆదాయం



రమణయ్యపేటలో పశువైద్యుడు సురేష్‌కు సన్మానం

కాకినాడ రూరల్: రైతన్నలకు పాడి పశువుల ద్వారా అదనపు ఆదాయం కలుగుతుందని, పశువులను వేసవిలో కంటికి రెప్పలా కాపాడుకోవాలని పశు వైద్యుడు తలాటం సురేష్ పేర్కొన్నారు. ప్రపంచ పశు వైద్యుల దినోత్సవం పురస్కరించుకుని రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పశువైద్యుడు సురేష్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో పశు వైద్యుల పాత్ర కీలకమన్నారు. వ్యవసాయానికి అనుబంధమైన పాడి పరిశ్రమ వృద్ధి పశువైద్య సిబ్బంది సేవలు అవసరమన్నారు. నేడు పాడి పశువులు చాలా ఖరీదుగా ఉండడంతో వాటి ఆలనా పాలనా చూసుకోవడంతో పాటు వేసవిలో తాగునీరు సక్రమంగా అందించి దాహార్తి తీర్చడంతోపాటు గ్రాసం కూడా అందించాలన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, డాక్టరు అద్దాల సత్యనారాయణ, పట్నాయక్, రాజా, కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్ క్రీడాకారిణికి చేయూత



నస్రీన్‌కు సహాయం అందిస్తున్న ఎంపీ

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన జాతీయ బాక్సింగ్ క్రీడాకారిణి షేక్ నస్రీన్‌కు కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ ఆదివారం చేయూత నందించారు. చిన్నతనం నుంచి బాక్సింగ్ క్రీడపై మక్కువ పెంచుకున్న నస్రీన్ కుటుంబ సభ్యులు, దాతల ప్రోత్సాహంతో ఇప్పటికే రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలలో అనేక పతకాలు సాధించింది. 2019లో ఉత్తమ బాక్సర్‌గా అవార్డును అందుకుంది. శనివారం కాకినాడ క్యాంపు కార్యాలయంలో ఎంపీ ఉదయ్ శ్రీనివాస్‌ను కలిసి తాను సాధించిన పతకాలు, అవార్డులు చూపించి తన ఆర్థిక పరిస్థితిని వివరించింది. దీంతో ఎంపి రూ.1,28,000 ఆర్థిక సహాయం అందించి, భవిష్యత్తులో అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

తుని: తుని–గుల్లిపాడు మధ్యలో రైలు నుంచి జారిపడి ఓ వ్యక్తి మృతి చెందాడని జీఆర్పీ ఎస్సై జి.శ్రీనివాసరావు తెలిపారు. బెంగుళూరు నుంచి గౌహతి వెళుతున్న సూపర్ ఫాస్ట్ రైలులో ప్రయాణిస్తున్న వ్యక్తి పాయకరావుపేట మండలం పీఎల్ పురం వద్ద ప్రమాదవశాత్తూ జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి దగ్గర లభించిన సెల్‌ఫోన్ ఆధారంగా అస్సాంకు చెందిన వ్యక్తిగా గుర్తించి బంధువులకు సమాచారం ఇచ్చామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కరప మండల అధికారుల ఫోన్‌నంబర్లు

ఎంపీడీఓ	9346790319
తహసీల్దార్	9849903908
ఈఓ పీఆర్ ఆర్డీ	9849352293
మండల ఇంజనీరింగ్ అధికారి	8886865417
మండల వ్యవసాయాధికారి	8331056589
ఎంఈఓ–1	8008293994
ఎంఈఓ–2	8919940656
హౌసింగ్ ఏఈఈ	7093930450
ఉపాధిపథకం ఏపీఓ	7093998259
వెలుగు ఏపీఓం	9959989273
ఎలక్ట్రికల్ ఏఈ	9440812638
ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ	9603007219
ఇరిగేషన్ ఏఈఈ	9704651826
డ్రెయినేజీశాఖ ఏఈఈ	9963744219
ఆర్అండ్‌బి ఏఈఈ	9440818530
కరప పీహెచ్‌సీ డాక్టర్	8096940176
వేళంగి పీహెచ్‌సీ డాక్టర్	9962553545
పశుసంవర్ధకశాఖ ఏడీఏ	9490047668
నడకుదురు వెటర్నరీడాక్టర్	9652547579
వేళంగి వెటర్నరీ డాక్టర్	8332973558
అరట్లకట్ట వెటర్నరీ డాక్టర్	9494671642

పశువులకు వడదెబ్బ

- వేసవి తాపానికి అనారోగ్యానికి గురయ్యే అవకాశం
- పశు సంరక్షణలో తగిన జాగ్రత్తలు అవసరం
- పాడి రైతులకు పశువైద్యుల సూచన



చెట్ల నీడన కట్టిన పశువులు

కాకినాడ సిటీ: వేసవిలో పశుపోషణ, సంరక్షణలోనూ తగిన జాగ్రత్తలు పాటించాలని పశువైద్య నిపుణులు సూచిస్తున్నారు. తీవ్రమైన ఎండలు, వడగాడ్పుల కారణంగా మూగజీవాలు అనారోగ్యం బారినపడే అవకాశం ఉందని, తద్వారా వాటిని నష్టపోయే ప్రమాదముందని హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా పాడిరైతులు, పశుపోషకులు తమ వద్ద ఉన్న ఆవులు, గేదెలు, ఎద్దులు, మేకలు, గొర్రెలు వంటి పశు సంపదను కాపాడుకోవాలని చెబుతున్నారు. సాధారణంగా 18 నుంచి 35 డిగ్రీల ఉష్ణోగ్రతలు పశువులకు సౌకర్యంగానే ఉంటుంది. అంతకన్నా ఎక్కువైతే అనారోగ్యానికి గురవుతాయి. ముఖ్యంగా వడదెబ్బకు గురైన ఆవులు గేదెలు చూడి కట్టే అవకాశాన్ని కోల్పోతాయి. ఒక్కోసారి మృత్యువాత పడే అవకాశం కూడా ఉంది. ఈ నేపథ్యంలో అప్రమత్తంగా వ్యవహరించి, కొన్ని జాగ్రత్తలు పాటిస్తే వేసవి వ్యాధుల నుంచి మూగ జీవాలను రక్షించుకోవచ్చని పశువైద్యాధికారులు సలహా ఇస్తున్నారు.

పాడి పరిశ్రమపై ఆధారం

జిల్లాలోని ప్రతి పల్లెలోను రైతులు పాడి పరిశ్రమపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. తుని, జగ్గంపేట, ప్రత్తిపాడు, పిఠాపురం, పెద్దాపురం, నియోజకవర్గాల్లో సగానికి పైగా భూములు మెట్ట ప్రాంతాలు కావడంతో వేసవిలో వ్యవసాయం అంతంత మాత్రంగానే ఉంటుంది. దీంతో రైతులు జీవనం కోసం పాడి పరిశ్రమ తప్పని సరిగా సాగిస్తారు. అదే విధంగా మిగిలిన నియోజకవర్గాల్లో కూడా పాడిపరిశ్రమ ఎక్కువగానే ఉంది. ప్రతి రైతు కుటుంబం వద్ద కనీసం ఆవు, గేదెలు ఉంటాయి. కొన్ని గ్రామాల్లో మేకలు, గొర్రెలు కూడా పెంచుతుంటారు. రైతులకు పంటలు కలిసిరాని సమయంలోనూ పాడి రంగమే ఆదుకుంటోంది. వేసవిలో తీవ్ర ఉష్ణోగ్రతల కారణంగా పాల ఉత్పత్తి తగ్గిపోవడంతో రైతుల ఆదాయం కోల్పోతారు. అటువంటి పాడి సంపదను కాపాడుకోవాలని పశువైద్యులు చెబుతున్నారు. ప్రస్తుత వేసవిలో ఎండల తీవ్రత తక్కువగా ఉండే ఉదయం, సాయంత్రం వేళల్లోనే పశువులకు మేతకు తీసుకువెళ్లాలి. వాటిని ఉంచే పశువులశాలలో చల్లని వాతావరణం ఉండేలా, గాలి, వెలుతురు వచ్చేలా ఏర్పాట్లు చేయాలి.

నల్లజాతి పశువులకే వడదెబ్బ ముప్పు



పాడి పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న రైతులు పశువులకు అనారోగ్య సమస్యలు వస్తే సొంత వైద్యం చేయకూడదు. వేసవిలో ఉష్ణోగ్రతలు పెరిగి గాలిలో తేమ తగ్గినప్పుడు పశువులు ఎక్కువగా వడదెబ్బకు గురవుతాయి. గాలి ప్రసరణ సరిగా లేని ప్రాంతల్లో నీటి సౌకర్యం అందుబాటులో లేనప్పుడు, అధిక శ్రమకు గురై వేడిగాలుల తాకిడికి లోనైనప్పుడు వడదెబ్బకు గురవుతాయి. సాధారణంగా ఒకటి కన్నా ఎక్కువ సంఖ్యలో ఒకేసారి వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉంది. తెల్లజాతి పశువుల కన్నా నల్లజాతి పశువులు ఎక్కువగా వడదెబ్బకు గురవుతాయి. వడదెబ్బ తగిలిన పశువులు ముఖాన్ని చల్లని నీటితో కడగాలి. ఐస్‌గడ్డను పలుచటి వస్త్రంలో చుట్టి పశువు నుదుటిపై మెల్లగా రుద్దాలి. వైద్యులకు సమాచారం ఇచ్చి సిలైన్ పెట్టించాలి.

ఎస్‌జీఎస్ సురేష్‌బాబు, పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్, కరప సబ్‌డివిజన్

సన్‌స్ట్రోక్ నివారణ చర్యలు

- పశువుల పాక చుట్టూ పాత గోనె సంచులు, చీరలు కట్టి వాటిని అప్పుడప్పుడు చల్లని నీటితో తడుపుతూ ఉండాలి.
- పశువుల పాక పాత రేకులతో వేసినట్లయితే పైకప్పును కొబ్బరి, తాటి ఆకులు లేదా వరి, రెల్లి గడ్డితో కప్పాలి.
- మంచినీరు ఎప్పుడూ అందుబాటులో ఉంచేలా చూడాలి.
- ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే మేతకు తీసుకువెళ్లాలి
- పశువులకు వీలైనంత వరకు పచ్చగడిని మేతగా వేయాలి.
- సంకరజాతి ఆవులు, గేదెలు ఉన్న పాకలో ఫ్యాన్లు ఏర్పాటు చేయాలి.

వడదెబ్బ లక్షణాలు

- పశువుల శరీర ఉష్ణోగ్రత 101 నుంచి 106 డిగ్రీల వరకు పెరుగుతుంది. అలాగే నడిచేటప్పుడు పశువులు తూలుతాయి.
- శ్వాసక్రియ రేటు ఎక్కువగా ఉంటుంది. పశువులు చాలా నీరసంగా కనబడతాయి. నోటి వెంట చొంగ కూడా కారుతుంది.
- ఒక్కోసారి కింద పడి విలవిల్లాడి స్పృహ కోల్పోతాయి. అదే సమయంలో పశువులు నీటి కోసం అల్లాడుతుంటాయి. చర్మం ఎండిపోయినట్టు ఉంటుంది. పాల ఉత్పత్తి పడిపోతుంది.
- చూడి పశువుల్లో గర్భస్రావాలు సంభవిస్తాయి. పునరుత్పత్తి ప్రక్రియ కూడా కుంటుపడుతుంది.

వీలైనంత వరకు ఫ్యాన్లు ఏర్పాటు చేస్తే మంచిది. ఉదయం పచ్చగడ్డి, రాత్రి ఎండు గడ్డి మేతగా వేయాలి.

పాటించాల్సిన జాగ్రత్తలివే..

- పశువుల తాగే నీటిని స్వచ్ఛంగా, శుభ్రంగా ఉంచాలి
- కలుషిత నీరు తాగితే వ్యాధికారక క్రిములు శరీరంలోకి చేరి పారుడు వ్యాధిని కలుగుజేస్తాయి
- రోజులో కనీసం నాలుగు సార్లు నీటిని అందించాలి.
- పగలు నీడ ప్రాంతంలోని తొట్టెలో ఉన్న నీటిని పశువులకు తాగించాలి.
- ఉష్ణోగ్రత, గాలిలో తేమ, పశువుల వయసు ఆధారంగా రోజుకు 35 లీటర్ల నీరు అవసరమవుతుంది
- పాలిచ్చే పశువులు ప్రతి లీటరు పాల దిగుబడికి 4 నుంచి 5 లీటర్ల నీరు తాగుతాయి.

లయన్స్‌క్లబ్ సేవా మహోత్సవం

రూ.8 లక్షల విలువైన పరికరాల పంపిణీ



మహోత్సవంలో పరికరాలు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

బాలాజీచెరువు: లయన్స్ ఇంటర్నేషనల్ డైమండ్ జూబ్లీ వేడుకల్లో భాగంగా లయన్స్‌క్లబ్ కాకినాడ సేవా మహోత్సవం పేరుతో ఆదివారం స్థానిక సూర్య కళామందిరంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కాకినాడ సిటీ, రూరల్ ఎమ్మెల్యేలు వనమాడి వేంకటేశ్వరరావు, పంతం నానాజీ,లు హాజరై 8లక్షల విలువైన కుట్టుమిషన్లు, వెట్‌గ్రైండర్లు, ఏసీలు, కృత్రిమ అవయవాలు పంపిణీ చేశారు. సమాజ సేవల లయన్స్ మంచి వేదికగా నిలుస్తుందని, లయన్స్ సభ్యత్వం సమాజంలో గౌరవంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ వి.విజయ్‌కుమార్‌రాజు, జిల్లా గవర్నర్ ఈశ్వర్‌కుమార్, వేలురు సూర్యనారాయణ, లయన్ జిల్లా పూర్వపు గవర్నర్ బాదం బాలకృష్ణ, గోదావరి చాంబర్ కామర్స్ పూర్వపు అధ్యక్షుడు డేగల చంద్రశేఖర్(రమేష్) పాల్గొన్నారు.

నేటి నుంచి వేసవి విజ్ఞాన శిక్షణ

కరప: మండలం వేళంగి శాఖా గ్రంథాలయంలో సోమవారం నుంచి జూన్ నెల 6వ తేదీ వరకు వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు లైబ్రేరియన్ పాట్నీడి వెంకటరంగయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతిరోజూ ఉదయం 8 గంటల నంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పాఠకులకు వివిధ అంశాలపై శిక్షణ నిర్వహిస్తారన్నారు. కథలు వినడం, చెప్పడం, పుస్తక సమీక్ష, స్పోకెన్ ఇంగ్లిష్, పేపర్ క్రాఫ్ట్, డ్రాయింగ్ వంటి అంశాల్లో శిక్షణ ఇస్తారన్నారని తెలిపారు. కరప ఉపగ్రంథాలయంలో కూడా వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తున్నట్టు, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆల్లైబ్రరీ ప్రతినిధి ఎస్‌వీఎస్‌పీ కుమార్ తెలిపారు.

ఎందరికో ఆశ్రయం కల్పిస్తున్న పెద్దాపురప్పాడు స్కూల్

- పాఠశాల డైమండ్ జూబ్లీ ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ మంత్రి కన్నబాబు



పెద్దాపురప్పాడు హైస్కూలులో మాజీ మంత్రి కన్నబాబును సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

కరప: ఎందరినో విద్యావేత్తలను చేసి, ఆశ్రయం కల్పిస్తున్న పెద్దాపురప్పాడు బిరుదా సూర్యనారాయణ (ఫకీర్రావు) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంటర్మీడియెట్ కళాశాల ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉందని వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల కన్వీనర్, మాజీ మంత్రి కురసాల కన్నబాబు పేర్కొన్నారు. పెద్దాపురప్పాడు జెడ్పీ ఉన్నత పాఠశాల ఏర్పాటు చేసి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పూర్వవిద్యార్థుల సంఘం నిర్వహిస్తున్న డైమండ్ జూబ్లీ ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజలకు విద్యనందిస్తున్న హైస్కూలుకు ఏడు ఎకరాలు స్థలాన్ని దానమిచ్చిన మాజీ ఎమ్మెల్యే, తాళ్లరేవు సమితి మాజీ అధ్యక్షుడు బిరుదా సూర్యనారాయణ(ఫకీర్రావు) ప్రజల్లో చిరస్థాయిగా గుర్తుండిపోతారన్నారు. తాను ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్నప్పుడు ఈ హైస్కూలులో రెండు బ్లాకులు నిర్మించి, అప్పుడు కేంద్ర మంత్రిగా ఉన్న చిరంజీవిని తీసుకొచ్చి, ప్రారంభోత్సవం చేయించిన విషయాన్ని ఈ సందర్భంగా మాజీమంత్రి కన్నబాబు గుర్తుచేశారు. అలాగే నాడు–నేడు పథకంలో పెద్దాపురప్పాడు హైస్కూలుకు ప్రహరీ కూడా నిర్మించామన్నారు. మనబడి–మనగుడి అనే విషయాలు పూర్వవిద్యార్థులు మరువరాదన్నారు. పూర్వవిద్యార్థులు కోరుతున్న ఈహైస్కూలులో స్కిల్‌సెంటర్ ఏర్పాటుకు, పాఠశాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని కన్నబాబు తెలిపారు. ముందుగా పాఠశాల స్థలదాత బిరుదా సూర్యనారాయణ(ఫకీర్రావు) విగ్రహానికి, 195–96 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు నిర్మించిన గాంధీ విగ్రహానికి పూర్వవిద్యార్థులతో కలిసి కన్నబాబు పూల మాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాల ఉపాధ్యాయులను ఆయన సత్కరించారు. ఈసందర్భంగా పూర్వవిద్యార్థుల సంఘం ప్రతినిధులు కన్నబాబును ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. సాయంత్రం పూర్వవిద్యార్థి, రిటైర్డ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నల్లా సత్యనారాయణమూర్తి అధ్యక్షతన రేపటి తరం కోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. సమాఖ్య నిర్మాణం, భవిష్య కార్యక్రమంపై చర్చించారు. కొంతకార్పస్ ఫండ్ ఏర్పాటు చేసి మెరిట్ స్టూడెంట్స్, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ఆర్థిక సాయం అందించడం, పాఠశాలలో స్కిల్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేయాలని తీర్మానం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన మహిళా కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. పూర్వవిద్యార్థుల సంఘం అధ్యక్షుడు బొండా సూర్యనారాయణ(చంటిబాబు), బొండా పట్టాభిరామయ్య, గొల్లపల్లి లక్ష్మణరావు, ముడే పీటర్, దేవు సదానందమూర్తి, యాళ్ల కృష్ణారావు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, మాజీఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, సీఈఓ వీవీవీ లక్ష్మణరావు, ఇస్రోసైంటిస్ట్ పి.సోమరాజు, కట్టా కృష్ణారావు, పూర్వవిద్యార్థులు చిక్కం రామచంద్రరావు, ఎర్రంశెట్టి సత్యనారాయణ, బిరుదా సత్యనారాయణ, హెచ్ఎం ఎస్ఎస్ఎస్ శ్రీనివాస్, ఎన్‌సీసీ అధికారి తెలగాని వెంకట్రావు, పీడీ బీవీవీఎస్ ప్రసాద్ వివిధ పార్టీల నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎంసీ ప్రిన్సిపాల్‌గా విష్ణువర్ధన్



డాక్టర్ అత్తలూరి విష్ణువర్ధన్

కాకినాడ క్రైం: స్థానిక రంగరాయ వైద్య కళాశాల(ఆర్ఎంసీ) ప్రిన్సిపాల్‌గా డాక్టర్ అత్తలూరి విష్ణువర్ధన్‌ని ప్రభుత్వం నియమించింది. ఆర్ఎంసీకి వైస్ ప్రిన్సిపాల్(అడ్మిన్)గా కొనసాగుతున్న డాక్టర్ విష్ణువర్ధన్ సిద్ధార్థ మెడికల్ కాలేజీలో 1982 ఎంబీబీఎస్ విద్యాభ్యాసం పూర్తి చేశారు. మణిపాల్ కస్తూర్బా వైద్య కళాశాలలో 1991–94 మధ్య ఎండీ అనస్తీషియా చదివారు. 1997లో తొలి పోస్టింగ్ కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో అనస్తీసియా అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా లభించింది. 2006లో ఇదే కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా, 2015లో ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు. 2022 మార్చిలో తాను చదువుకున్న విజయవాడ సిద్ధార్థ మెడికల్ కళాశాలకు అనస్తీషియా హెచ్‌వోడీగా పదోన్నతిపై వెళ్లారు. ఆగస్టులో కాకినాడకు బదిలీపై వచ్చి ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించి, 2023 ఫిబ్రవరిలో ఆర్ఎంసీ అనస్తీషియా హెచ్‌వోడీగా బాధ్యతలు చేపట్టి సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారు. డాక్టర్ విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో జీజీహెచ్‌లో తొలిసారి 24 గంటల ఆర్థో, న్యూరోసర్జరీ ఓటీ సేవలు ప్రారంభమయ్యాయి. అనస్తీషియా పురోగతిని గుర్తించిన కాకినాడ సీ పోర్ట్ లిమిటెడ్ యాజమాన్యం కేవీరావు, మెర్ల మురళీధర్‌ల ఆధ్వర్యంలో రూ.కోటి విలువైన ఐదు అనస్తీషియా వర్క్ స్టేషన్లు, మూడు మల్టీ పారా మానేటర్లు, ఒక ఇంక్యుమేటింగ్ బ్రాంకో స్కోపిక్, ఒక అల్ట్రా సౌండ్ యంత్రం, డీఫిబ్యులేటర్లు అధునాతన యంత్ర పరికరాలను మత్తు వైద్య విభాగానికి సమకూర్చారు. 2015–22 మధ్య పీడియాట్రిక్స్, ప్లాస్టిక్, యూరాలజీ ఓటీలకు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తూ యావత్ ఆసుపత్రి చరిత్రలోనే అత్యధిక సర్జరీలు చేసిన ఘనతను దక్కించుకున్నారు. దీంతో ఆరోగ్యశ్రీ ట్రస్టు నుంచి రాష్ట్ర స్థాయి అవార్డు అందుకున్నారు. హెచ్‌వోడీ, వైస్ ప్రిన్సిపాల్‌గా ఆయన అందిస్తున్న ఉత్తమ సేవలకు గాను డాక్టర్ విష్ణువర్ధన్ మూడు సార్లు కలెక్టర్ అవార్డులు పొందారు. కాకినాడ సీ పోర్ట్స్ యాజమాన్యం సహా, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్ సహా జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి, ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ ఎంపీఆర్ విఠల్, ఏపీఎన్‌జీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి వెంకట కృష్ణ, జీజీహెచ్ జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడు పాలపర్తి మూర్తిబాబు తదితరులు డాక్టర్ విష్ణువర్ధన్‌కు అభినందనలు తెలిపారు.

నీట్ పరీక్షకు ఏర్పాట్లు చేయండి

- డీఆర్వో వెంకట్రావు ఆదేశం

కాకినాడ సిటీ: మెడికల్ కాలేజీలలో ప్రవేశానికి మే 4వ తేదీన నీట్ పరీక్ష నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకట్రావు సంబంధిత అధికారులను ఆదివారం ఆదేశించారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో నేషనల్ ఎలిజిబులిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్ (నీట్) నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. మే 4న మధ్యాహ్నం 2 గంటల వరకూ నీట్ పరీక్ష జిల్లా కేంద్రం కాకినాడలో 10 పరీక్ష కేంద్రాల్లో ఓఎంఆర్ షీట్ విధానంలో జరుగుతుందన్నారు. ఈ పరీక్షకు జిల్లాలో 2880 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని వివరించారు. కేంద్రాల్లో సీసీ కెమెరాలతో నిశిత పర్యవేక్షణ, పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులను కోరారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 163 ఆఫ్ బీఎన్ఎస్ఎస్ (144 అండర్ సెక్షన్ సీఆర్‌పీసీ సీఆర్‌పీసీ) అమలు చేయాల న్నారు. పరీక్షలు జరిగే రోజున పరీక్ష కేంద్రాలకు స్పెషల్ బస్సులను నడపాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణకు రెగ్యులర్ ఉద్యోగులను మాత్రమే ఇన్విజిలేటర్లుగా నియమించాలని, సైన్స్ బోధనా నేపథ్యం కలిగిన వారేవరినీ నియమించకూడదని తెలిపారు. చీఫ్ సూపరింటెండెంట్లు,అధికారులు సమన్వయంతో నీట్ పరీక్షను సజావుగా నిర్వహించాలని డీఆర్వో వెంకట్రావు కోరారు.

బరితెగించిన కూటమి నేతలు



సర్పవరంలో రికార్డింగ్‌ను తలపించేలా నృత్యాలు

కాకినాడ రూరల్: అధికారమే అవధిగా కూటమి పార్టీ నాయకులు బరితెగిస్తున్నారు. సర్పవరం గ్రామంలో నేరేళ్లమ్మ జాతరను పురస్కరించుకుని శనివారం రాత్రి రికార్డింగ్ డ్యాన్స్‌ను తలపించేలా డ్యాన్స్ ప్రోగ్రాలు నిర్వహించారు. జనసేన నాయకులు పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన డ్యాన్స్ ప్రోగ్రాలలో అశ్లీలత ఉండడంపై గ్రామస్తులు విస్మయానికి గురయ్యారు. జాతరలో అశ్లీల నృత్యాలు జరిగినా సర్పవరం పోలీసులు ప్రేక్షక పాత్ర వహించడంపై విమర్శలు వస్తున్నాయి.

ముగిసిన హాకీ పోటీలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కాకినాడ కేంద్రీయ విద్యాలయం ఆధ్వర్యంలో స్థానిక డీఎస్ఏలో శని, ఆదివారం నిర్వహించిన కేంద్రీయ విద్యాలయ హైదరాబాద్ రీజియన్ హాకీ పోటీలు సాయంత్రంతో ముగిశాయి. ఈ పోటీల్లో వెంకట గిరి, కరీంనగర్, కాకినాడ కేంద్రీయ విద్యాలయం, విజయవాడ నుంచి 45 మంది బాలురు, 24 మంది బాలికలు పాల్గొన్నారు. పోటీల్లోలో విజేతలకు ఓఎన్‌జీసీ ప్రతినిధి మధుసూదన్‌రావు ట్రోఫీలు, సర్టిఫికెట్లు అందజేశారు. డీఎస్ఏ హాకీ కోచ్ నాగేంద్ర, హాకీ సంఘ ప్రతినిధి రవిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక జీవన శైలితో రక్తపోటు



వ్యాధులపై తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరిస్తున్న డాక్టరు అత్తిలి సూర్యకాంత్

కాకినాడ రూరల్: ఆధునిక జీవన శైలి కారణంగానే ఎక్కువ మంది అధిక రక్తపోటుకు గురవుతున్నారని, దీనిని నిర్లక్ష్యం చేస్తే శరీరంలో ప్రధాన అవయవాలు దెబ్బతినే అవకావం ఉందని మధుమేహ వైద్య నిపుణుడు అత్తిలి సూర్యకాంత్ పేర్కొన్నారు. బోట్‌క్లబ్ ఉద్యాన వనంలో న్యూరో స్టార్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టరు అత్తిలి సూర్యకాంత్ మాట్లాడుతూ అధిక రక్త పీడనం వలన గుండెపై భారం పెరగడంతో పాటు మెదడులోని రక్తనాళాలు సున్నితత్వాన్ని కోల్పోతాయన్నారు. నివారణకు గాను ఉప్పును పరిమితంగా వాడాలని, ఎత్తుగా తగ్గ బరువు ఉండాలన్నారు. డాక్టరు అనిల్, సాబెరా ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పించారు. రక్త పరీక్షలు, బీపీ, నరాల సాంద్రత, ఈసీజీ, పరీక్షలు నిర్వహించి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో వాకర్ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు అడబాడ రత్న ప్రసాద్, దాసరి శ్రీధర్, న్యాయవాది యనమల రామం, రవిశంకర్ పట్నాయక్, రాఘవరావు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో జాతకాలపైనే నమ్మకం



జాతక మాణిక్యం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు

బోట్‌క్లబ్: సమాజంలో జాతకాలపై నమ్మకం పెరిగిందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాల కొండబాబు పేర్కొన్నారు. ఆదివారం రాత్రి స్థానిక కల్యాణ మండపంలో సరిపెల్ల శ్రీరామచంద్రమూర్తి రచించిన జాతక మాణిక్యం పుస్తకావిష్కరణ చేశారు. తొలిత భారతమాత చిత్రపటానికి పూలమాలవేసి, జ్యోతి ప్రజ్వలన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జాతక మాణిక్యం పుస్తకాన్ని కాకినాడ వాసి రామచంద్రమూర్తి రచించడం కాకినాడకు గర్వకారణమన్నారు. అలాగే మనోవిద్యాన శాస్త్ర పరిశోధకులు వింజరపు జనార్దనం, ప్రముఖ సాహితీవేత్త కాశీ బోట్ల సత్యనారాయణ, రెడ్ క్రాస్ రాష్ట్ర చైర్మన్ వైడీ రామారావు, కాకినాడ ఆర్డీఓ మల్లిబాబు కూడా ప్రసంగించారు. రామచంద్రమూర్తి మాట్లాడుతూ తాను రచించిన పరిశోధన గ్రంథం జాతక మాణిక్యం సంస్కృత భాషలో రుషీశ్వరులు చెప్పిన అనేక యోగవిశేషాలు సోదాహరణంగా తేటతెలుగు గ్రంథంలో వివరించానని తెలిపారు.ఈ సమావేశంలో పాలపర్తి సుబ్బారావు, చల్లా శ్రీనివాస్ నిరంజన్, సమయమంతుల శ్రీనివాస్ కుమార్, గొట్టుముక్కల వెంకట నరసింహ శాస్త్రి, డాక్టర్ జీఎస్ఎన్ మూర్తి, డాక్టర్ మామిడిపాటి సుబ్రహ్మణ్యేశ్వరరావు, పున్నమ రాజు పాల్గొన్నారు.

మే డే పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్, కరపత్రం ఆవిష్కరిస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

కాకినాడ సిటీ: మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం కార్మిక, ప్రజా, రైతు వ్యతిరేక విధానాల అమలు చేస్తోందని, ప్రజల సమస్యలు పరిష్కరించకుండా మత విద్వేషాలు రెచ్చగొడుతుందని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఐఎఫ్‌టీయూ జిల్లా కమిటీ విమర్శించింది. ఆదివారం కాకినాడ కచేరిపేటలోని జిల్లా ఐఎఫ్‌టియు కార్యాలయంలో 139వ మేడే పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించిన సందర్భంగా కమిటీ రాష్ట్ర నాయకులు జె.వెంకటేశ్వర్లు, ఆదినారాయణమూర్తి, రాఘవులు మాట్లాడారు. దేశంలోని కార్మిక వర్గం బ్రిటిష్ కాలం నుంచి పోరాడి సాధించుకున్న 29 లేబర్ చట్టాలను రద్దు చేయడం కార్మిక ద్రోహమేనన్నారు. కార్మికులను కట్టు బానిసలుగా చేసే యజమానులకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్లు తెచ్చారన్నారు. ఈ లేబర్ కోడ్‌ల రద్దు కోసం కార్మిక వర్గం సంఘటితంగా, ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, విశాఖ ఉక్కు ప్రైవేటు రంగానికి అప్పగించేందుకు చేస్తున్న చర్యలపై వ్యతిరేకంగా పోరాడాల్సిన తక్షణ కర్తవ్యం కార్మిక వర్గం ముందు ఉందన్నారు. అందుకు 139 మేడేను విజయవంతం చేయడం, మేడే పోరాట వారసత్వాన్ని కొనసాగించడం కార్మిక వర్గం మీద ఉందని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు బంగారు సత్యనారాయణ, కె.నరసింహ, జి.దుర్గారావు, చంద్రరావు, తాతారావు, బంగార్రాజు, మహేష్, వడ్డి కాసులు తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

కాకినాడ రూరల్: పెనుమర్తి గ్రామంలో వివాహిత పెంకే జ్యోతి(23) ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆదివారం సాయంత్రం చికిత్స పొందుతూ మృతి చెందింది. తిమ్మాపురం పోలీసులు వివరాలల ప్రకారం.. రమణయ్యపేట కొత్తూరుకు చెందిన జ్యోతితో పెనుమర్తికి చెందిన కొల్లా దుర్గాప్రసాద్ మూడేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. భర్త, అత్త వేధింపులు భరించలేక ఆమె ఇంటి బయట దూలానికి శనివారం ఉరి వేసుకుంది. వెంటనే కుటుంబ సభ్యులు అచ్చంపేట జంక్షన్ వద్ద ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ జ్యోతి మృతి చెందినట్టు తిమ్మాపురం ఎస్సై మూర్తి తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, సోమవారం మృత దేహానికి పీఎం నిర్వహిస్తారన్నారు.

నేర్చుకుంటేనే నాణ్యత ఇవ్వగలం

– సీఎంఈలో వక్తలు

కాకినాడ క్రైం: స్థానిక జీజీహెచ్‌లో సర్జరీ విభాగం ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ప్రాంతీయ వైద్య విద్యా శిక్షణ(సీఎంఈ) నిర్వహించారు. హెచ్‌వోడీ డాక్టర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సీఎంఈకి అతిథులుగా డీఎంఈ డాక్టర్ నరసింహంతో పాటు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంపీఆర్ విఠల్, ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్ హాజరయ్యారు. డాక్టర్ విఠల్ మాట్లాడుతూ, నేర్చుకుంటేనే వైద్య సేవల్లో నాణ్యత అందించగలమని అన్నారు. ఇటువంటి శిక్షణలు విషయ అవగాహనకు ఎంతగానో దోహదపడతాయన్నారు. డాక్టర్లు సత్యనారాయణ, జయపాల్‌రెడ్డి, సాగర్‌బాబు, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, రామ్మోహన్‌లు రాష్ట్రంలో పలు ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులకు పలు అంశాలను వివరించారు. సీఎంఈలో ఆర్ఎంసీ సర్జరీ నిపుణులు శైలజ, శైలజారాణి, మైథిలి, నరేష్, కిషోర్, శివరామకృష్ణ, సహ అసిస్టెంట్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమెంటోలు బహూకరించారు.



మెమెంటో అందజేస్తున్న డాక్టర్ విఠల్, చిత్రంలో హెచ్‌వోడీ డాక్టర్ శ్రీనివాసరావు